సాక్షి
చిత్తూరు
గురువారం ౹ 6 ౹ ఫిబ్రవరి ౹ 2025



నులిమేద్దాం!
చిన్నారుల ఆరోగ్యానికి నులిపురుగు నివారణ చాలా కీలకమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. - 8లో



అడ్డగోలుగా మట్టి దోపిడీ
శాంతిపురం మండలంలో కొలమడుగు, రాళ్ల బూదుగూరు చెరువుల్లో అక్రమంగా మట్టి దోపిడీ చేస్తున్న కూటమి నేతలు. - 8లో



ఫెన్సింగ్ క్రీడలకు ఎంపిక
జాతీయ ఫెన్సింగ్ క్రీడలకు ఐరాలలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ బడుల్లో ఇక రాణి లక్ష్మీబాయిలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ, మున్సిపల్, సంక్షేమ, గిరిజన పాఠశాలల్లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన–ఆత్మరక్షణ కార్యక్రమం అమలు చేయనున్నట్లు సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ వెంకట రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతుల వరకు 2050 మంది, ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు 31,570 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. వీరందరికీ రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన–ఆత్మరక్షణ పథకంలో 20 సెషన్స్‌లో తైక్వాండో వంటి స్వీయ రక్షణ కళల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు రిజిస్టర్ అయిన సొసైటీ, ట్రస్ట్ నిర్వాహకులు కనీసం 3 సంవత్సరాలు అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, టెక్నికల్ అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తుకు జత చేయాల్సిన సర్టిఫికెట్స్ ఇతర వివరాలు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నేరుగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ కోరారు.

'గీత' మద్యం దుకాణాలకు 8 వరకు గడువు పెంపు

చిత్తూరు అర్బన్ : కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి (ఈఎస్) శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆ సామాజిక వర్గాలకు పది మద్యం దుకాణాలు కేటాయించగా బుధవారంతో దరఖాస్తు గడువు ముగిసింది. తాజాగా దరఖాస్తు చేసుకోవడానికి 8వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 10వ తేదీన చిత్తూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరుగుతుందని ఈఎస్ తెలిపారు. ఏదైనా సందేహాలు ఉంటే సమీపంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, చిత్తూరు నగరంలోని మిట్టూరులో ఉన్న ఈఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 119 మంది గైర్హాజరు

– డీవీఈవో సయ్యద్ మౌలా



సయ్యద్‌మౌలా, డీవీఈవో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు ఈనెల 5వ తేదీన పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డీవీఈవో సయ్యద్ మౌలా అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 14 కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ప్రయోగ పరీక్షల్లో ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం నిర్వహించిన ప్రయోగ పరీక్షకు 1060 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 941 మంది హాజరు కాగా 119 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో వెల్లడించారు.

కుప్పం ఇక పూర్తిస్థాయి మున్సిపాలిటీ

– 44 పోస్టులు మంజూరు

కుప్పం : మున్సిపాలిటీగా కుప్పంను ప్రకటించినా పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో పలు మున్సిపాలిటీలు, పంచాయితీలను నగర పంచాయితీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో విడుదల చేసింది. దీని ప్రకారం కుప్పం మున్సిపాలిటీ పూర్తి స్థాయి మున్సిపాలిటీగా విలీనం చేసింది. గత నాలుగేళ్లుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి డిప్యుటేషన్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ రాజ్ శాఖ నుంచి కొందరు అధికారులు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిగా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ కుప్పం మున్సిపాలిటీకి 44 పోస్టులను ప్రకటించింది. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి పే–స్కేలు సైతం పెరగనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు పక్క మున్సిపాలిటీల నుంచి డిప్యుటేషన్‌పై కుప్పంలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ పోస్టులు ఇవ్వనున్నారు. దీంతో కుప్పం మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో రూపాంతరం చెందడంతో పాటు సిబ్బంది కొరత తీరిందని అధికారులు అంటున్నారు.

మార్కొండ రెడ్డి నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా తిరుపతి నియోజకవర్గానికి చెందిన మార్కొండరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన వెలువరించింది.

యూరియా ఎక్కడ సారూ?



అరుగాలం శ్రమించే అన్నదాతకు మరో కష్టం వచ్చి పడింది. పంటల సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో లేక అగచాట్లు పడుతున్నారు. పొద్దునే సంచి పట్టి దుకాణాల ఎదుట అన్నదాతలు పడిగాపులు పడుతున్నా.. ఒక్క యూరియా సంచి కూడా దొరక్క వెనుదిరుగుతూ దిగాలు పడుతున్నారు. అధికారులు మాత్రం ఆందోళన పడొద్దు.. యూరియా నిల్వలున్నాయని చెబుతున్నారు..కానీ ఎక్కడా యూరియా రైతుకు కావాల్సిన స్థాయిలో లభ్యం కావడం లేదు. వ్యాపారులు ఇదే అదునుగా ధరలు పెంచి కృతిమ కొరత సృష్టించి రైతన్నలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇవేమీ పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు .. కుంటిసాకులు వెదుకుతూ ఏం లేదు.. గడ్డి పెరిగేందుకు యూరియా వేస్తున్నారని అధికారులు బుకాయిస్తుండడం గమనార్హం.



యూరియా కోసం క్యూకట్టిన రైతులు

- పెనుమూరు మండలంలో శనివారం యూరియా కొరత దుమారం రేపింది. యూరియా కోసం రైతులంతా పొద్దునే కొనుగోలు కేంద్రాన్ని ముట్టడించారు. బారులు తీరి యూరియా కోసం పడిగాపులు కాశారు. రైతుల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అయినా వ్యవసాయశాఖ అధికారులు తేరుకోలేకపోయారు. మధ్యాహ్నానానికి హడావుడి చేసి యూరియా తెప్పిస్తామని, కొరత లేకుండా చూస్తామని చెప్పారు.

- ఐరాల మండలంలో మంగళవారం యూరియా పంపిణీ అరకొరగా సాగింది. అక్కడ ఒక్క సెంటర్‌లో మాత్రమే యూరియా ఇవ్వడంతో రైతులు అధిక సంఖ్యలో గుమికూడారు. గంటల తరబడి ఎండలో నిరీక్షించారు. ఆ దుకాణానికి 30 మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించడంతో రైతుకు ఒక బస్తా మాత్రమే అందజేశారు. సాయంత్రం వరకు యూరియా కోసం రైతులు నిరీక్షించి నీరశించిపోయారు.

- జిల్లాలో వేధిస్తున్న కొరత
- 4 వేల హెక్టార్లల్లో వరి పంటసాగు
- సాగు విస్తీర్ణానికి తగ్గట్లు సరఫరా కాని యూరియా
- కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు
- పట్టించుకోని మండల అధికారులు

కాణిపాకం : పంటల సాగుకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.. అంటూ అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. జిల్లాలో యూరి యా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. ఇదే అదనుగా ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృ షోట్ల సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగం తెలిసినా మండల వ్యవసాయశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో రబీ సీజన్ కింద వరి, కూరగాయలు, ఆకు కూరలు, మిరప సాగుతో పాటు పలు రకాల పంటలను పండిస్తున్నారు. ప్రధానంగా బోరు, బావుల్లో నీరు పుష్కలంగా ఉన్న రైతులు వరిని విస్తారంగా సాగు చేస్తారు. గతేడాది వరి 7,496 హెక్టార్లలో సాగు కాగా రబీ సీజన్‌లోనే 3,948 హెక్టార్లలో సాగు చేశారు. ఈ సారి రబీ కింద సుమారు 10 వేల మంది రైతులు 4 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగులోకి తెచ్చారు. గత నెల రోజుల వ్యవధిలోనే అధిక విస్తీర్ణంలో నాట్లు పడ్డాయి. నగరి, పుంగనూరు, పెనుమూరు, చిత్తూరు, గుడిపాల, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం తదితర మండలాల్లో అధిక విస్తీర్ణంలో పంట సాగులోకి వచ్చింది.

నాట్లు ఆలస్యం..

ఖరీఫ్ ఆరంభం నుంచి అదునుకు తగ్గ వర్షాలు కురవలేదు. వేరుశనగ ఒబ్బిడి సమయానికి కూడా వర్షాలు కురవక పంటలు నేలమట్టమయ్యాయి. ఆ తర్వాత భారీ వర్షాలు కురిశాయి. వీడని తుపానుతో చెరువులు, కుంటలు, బోరు బోవులకు నీళ్ల చేరాయి. ఇలా డిసెంబర్ వరకు వర్షాలు ముంచెత్తాయి. ఈ కారణంగా అక్టోబర్‌లో వేయాల్సిన నాట్లు ఆలస్యమయ్యాయి. డిసెంబర్ చివరి రెండు వారాల నుంచి నాట్లు మొదలు పెట్టారు. ఇప్పటికి కూడా నాట్లు వేసే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే మండల అధికారులు వరి సాగు చేసిన రైతు వివరాలను సేకరించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారులకు సైతం సాగు వివరాలను పక్కాగా అందించలేకపోతున్నారు. తద్వారా సాగు విస్తీర్ణం తక్కువగా చూపిస్తున్నారని. ఈ ఫలితంగా రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా ఏదయ్యా...

జిల్లాలోని రైతులు వరికి అధిక మోతాదులో యూరియా వాడుతారు. దీని దృష్ట్యా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేసేది. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలానికే రైతులకు ఇబ్బందులు వచ్చి పడ్డాయి. ప్రధానంగా యూరియా సమస్య వెంటాడుతోంది. గత వారం రోజులుగా చూస్తే రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించి నీరసించిపోతున్నారు. చివరకు చాలా మంది రైతులకు ఒక బస్తా కూడా చేతికందని పరిస్థితి ఏర్పడింది. కాగా అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 9,131 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా అయినట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 400 టన్నులు మిగులు ఉంది. రైతు భరోసా కేంద్రాలు 502 ఉండగా 201 కేంద్రాల్లోనూ, సహకార సంఘాలు 5, ప్రైవేటు షాపుల్లో 200కు గాను 108 షాపులో యూరియా నిల్వలున్నట్లు లెక్కలున్నాయి. కాగా గురువారం సాయంత్రానికి మరో 5072 టన్నులు రానున్నాయని, బస్తా రూ.270కు విక్రయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైతుల కుస్తీ..

యూరియా కోసం జిల్లాలోని రైతులు కుస్తీ పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద అల్లాడిపోతున్నారు. క్యూ కడితే యూరియా చేతికొచ్చేందుకు కొన్ని గంటలు పడుతోంది. ఇందుకు రైతులు అన్ని పనులు మానుకొని యూరియా కోసం కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేటు షాపులు సిండికేట్ అయ్యాయి. కొన్ని షాపుల్లో యూరియా ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా నిల్వ ఉంచేశారు. మరి కొన్ని చోట్ల యూరియా ఉన్న పంపిణీ చేయకుండా డిమాండ్ పెంచి అధిక రేట్లకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పట్టించుకోవాల్సిన మండల స్థాయి అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు అధికారులు స్పందించి రైతులకు యూరియా లోటు లేకుండా చూడాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో యూరియా సరఫరా వివరాలు	
నెల	టన్నులు
నవంబర్	2,838
డిసెంబర్	2,858
జనవరి	2,235
ఫిబ్రవరి	1,200

జిల్లా సమాచారం

రైతు భరోసా కేంద్రాలు	502
యూరియా ఉన్న కేంద్రాలు	201
ప్రైవేటు ఎరువు దుకాణాలు	200
యూరియా నిల్వ ఉండే దుకాణాలు	108
వరి సాగు విస్తీర్ణం	4 వేల హెక్టార్లు
సాగు చేస్తున్న రైతులు	10 వేల మంది
ప్రస్తుతం యూరియా నిల్వలు	400 టన్నులు

గత ప్రభుత్వంలో ఇబ్బందులు లేవు



రైతు భరోసా కేంద్రాల ద్వారా గత ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేవి. ప్రస్తుతం ఎరువుల కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ఇచ్చేలా కనిపించడం లేదు. రెండు రోజుల కిందట ఓ ప్రైవేటు దుకాణంలో యూరియా కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఒక బస్తా కోసం మండల కేంద్రానికి పనులు వదిలేసి మండల కేంద్రానికి వచ్చి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
– రామయ్య, రైతు బంగారు పాళెం

అగచాట్లు పడుతున్నాం



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో విరివిగా యూరియా అందేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్బీకే కేంద్రాలు నిర్వీర్యం చేసి అన్నదాతల వెన్ను విరిచింది. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలో ఎరువులు ఉంచటంలేదు. కేవలం సింగల్ విండో, బహిరంగ మార్కెట్లో లభ్యత ఉంచింది. దీంతో ఎరువుల కష్టాలు వర్ణాతీతంగా ఉన్నాయి. రైతులను యూరియా కోసం ఇలా ఇబ్బంది పెట్టడం సరి కాదు.
– విజయ్‌మోహన్, రైతు, ఐరాల

యూరియాను పశుగ్రాసానికి వాడుతున్నారు..



జిల్లాలో 5,500 హెక్టార్లల్లో పశుగ్రాసం ఉంది. విడతల వారీగా గ్రాసంను నాటుకుంటున్నారు. ఈ యూరియాను ఎక్కువ మంది రైతులు పశుగ్రాసానికి వాడుతున్నారు. ఈ కారణంగా యూరియా చాలడం లేదు. ఈ యూరియా వాడిన పశుగ్రాసం తిన్న ఆవులకు అనారోగ్య సమస్యలు వస్తాయి. ఆ పాలు తాగిన ప్రజలకు క్యాన్సర్ లాంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. ఈ యూరియాకు ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ తీసుకోమని చెబుతున్నాం. వాటిని రైతులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ఇబ్బంది లేకుండా యూరియాను సరఫరా చేస్తున్నాం.
– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఎంఎస్‌ఎంఈ సర్వే పునఃప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) నిర్వహణపై క్షేత్రసర్వే మళ్లీ మొదలు పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలకు పంపారు. ప్రతి ఎంఎస్ఎంఈని విధిగా సర్వే చేయాల్సిందేనంటూ నిర్దేశించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, పల్లెల్లో ఎంపీడీఓలకే పూర్తి బాధ్యతని ఆ ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గత సంవత్సరం డిసెంబరు 29న మొదలైన సర్వే ఈనెల 2వ తేదీతో ముగిసింది. నెల రోజులకు పైగా గడువు ఇచ్చినా జిల్లాలో కనీసం 25 శాతం కూడా పూర్తి చేయలేదు. ఈక్రమంలో నిర్దేశిత ఎంఎస్ఎంఈలన్నీ పూర్తి అయ్యే దాకా సర్వే చేయనున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ ఏడీ వెంకటరెడ్డి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ సర్వే చేస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం వేగం పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంఎస్ఎంఈలను గుర్తించి వాటిని నమోదు చేసి భవిష్యత్‌లో ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు పొందాలంటే ఈ సర్వేనే ఆధారం. వీటిని విద్యుత్ సర్వీసులు ఆధారంగా నమోదు చేస్తున్నారు. ఆ విధంగా జిల్లాలో మొత్తం 67,151 సర్వీసులను గుర్తించగా ఇప్పటి వరకు 15,509 పరిశ్రమలను మాత్రమే సర్వేలో నమోదు చేశారు.

పకడ్బందీగా ప్రమోషన్లు

డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలన్నా... ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నా సీనియారిటీ జాబితా తలనొప్పిగా మారింది. అయ్యోర్ల సీనియారిటీ జాబితా కచ్చితత్వంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా వరకు ప్రక్షాళన చేపట్టింది. అదే విధంగా ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు చేపట్టారు.

- ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాకు కసరత్తు
- ప్రత్యేక బృందాలతో పరిశీలన
- 1989 డీఎస్సీ నుంచి 2018 వరకు జాబితా
- ఈనెల 10 లోపు పూర్తి చేసేలా చర్యలు



చిత్తూరు డీఈఓ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సీనియారిటీ జాబితాను పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. ఈ కసరత్తును ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4,738 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ కేడర్ నుంచి హెచ్ఎం కేడర్ వరకు సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు నియామకం

సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ కసరత్తును ఉమ్మడి చిత్తూరు జిల్లా నోడల్ అధికారి కేడర్‌లో డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. కసరత్తును పకడ్బందీగా పూర్తి చేసేందుకు చిత్తూరు, తిరుపతి డీఈఓ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బందిని నియమించారు. ఒక్కో బృందానికి ఇద్దరు సిబ్బంది చొప్పున 9 బృందాలను నియమించి కసరత్తు చేపడుతున్నారు. ఈనెల 10వ తేదీలోపు కసరత్తును పూర్తి చేసి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు జాబితాను పంపేలా కసరత్తు నిర్వహిస్తున్నారు.

కసరత్తు సాగుతోంది ఇలా.....

జిల్లాలో 1989వ డీఎస్సీ నుంచి 2018వ సంవత్స రం డీఎస్సీ వరకు కేడర్‌ల వారీగా సీనియారిటీ జా బితాలను సిద్ధం చేస్తున్నారు. మొదటగా అన్ని మండలాల్లో ఎంఈఓలు జాబితాలను సిద్ధం చేసి డీఈఓ కార్యాలయానికి వివరాలు పంపుతున్నారు. ఆ వివరాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రికార్డుల ఆధారంగా మరో మారు పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 8295 ఎస్జీటీ కేడర్ పోస్టులు ఉండాల్సి ఉండగా 6,443 మంది, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 3263 పోస్టులు ఉండగా 3180 మంది విధులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎం కేడర్‌లో 408 మంది టీచర్ల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

సీనియారిటీ జాబితా కసరత్తు వివరాలు	
చిత్తూరు జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	2,436
సిద్ధం చేస్తున్న ఎస్జీటీ సీనియారిటీ జాబితా	6,443
స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో	3,263
హెచ్ఎం కేడర్‌లో	408

జాబితా సిద్ధం చేస్తున్నాం



ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించిన నియమ, నిబంధనలను పాటిస్తూ కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10వ తేదీలోపు కసరత్తును పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీ కేడర్‌లో 6443 మందికి గాను 3180 మంది జాబితాలు సిద్ధం చేయడం జరిగింది. మిగిలిన 3,263 మంది జాబితాలు, అదే విధంగా ఇతర కేడర్‌ల టీచర్ల జాబితాలను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.
– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు జిల్లా

భగీరథ యత్నం.. బాబు భగ్నం !

- వాటర్‌గ్రిడ్‌లో పుంగనూరుకు అన్యాయం
- రూ.1,825 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ రద్దు
- కొళాయిల ద్వారా నీరు ఎండమావే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒప్పందం, సర్వే పూర్తి
- గ్రిడ్ పరిధి నుంచి పుంగనూరు తొలగింపు



ఇంటింటికి కొళాయిల ద్వారా నీటి సరఫరా

పుంగనూరు : పుంగనూరు మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని మండలాలకు శాశ్వత తాగునీటి కష్టాలను తీర్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో గత సీఎం వైఎస్ జగన్ వాటర్‌గ్రిడ్ పథకాన్ని మంజూరు చేశారు. వచ్చే 30 ఏళ్ల దాక నీటి సమస్య లేకుండా చేసేందుకు వైఎస్సార్‌జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించేలా ప్రణాళిక చేశారు. అన్ని చర్యలు పూర్తయి, టెండర్లు, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ పథకంపై కక్ష కట్టి రద్దు చేసింది. అంతటితో వాటర్‌గ్రిడ్ పథకం నుంచి పుంగనూరు నియోజకవర్గాన్ని తొలగించేసింది. ఇక ఇంటింటికి కొళాయిల ద్వారా నీరు పుంగనూరుకు పగటి కలగానే మారింది.

అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలను కలిపి వాటర్‌గ్రిడ్ పథకం తీసుకొచ్చారు. కృష్ణా జలాలు తరలించి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని కొళాయిల ద్వారా అందించాలని నిర్ణయించారు. రూ.2,400 కోట్ల మంజూరు చేయగా 2023 సెప్టెంబర్‌లో జరిగిన రివర్స్ టెండరింగ్‌లో రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలై ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయింది. ఒప్పందం ప్రకారం వైఎస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ వద్ద నిర్మించే వాటర్ రీట్రీట్ ప్లాంట్ నుంచి పైప్‌లైన్ ద్వారా మదనపల్లె బైపాస్‌రోడ్డు మీదుగా గంగమ్మ గుడి నుంచి పుంగనూరు రూరల్ మండలం నుంచి పుంగనూరు మున్సిపాలిటీకి, ఇక్కడి నుంచి నియోజకవర్గంలోని రూరల్, చౌడేపల్లి, సదుం, రొంపిచర్ల, సోమల, పులిచర్ల, మండలాలకు పైప్‌లైన్ ద్వారా నీటిని రక్షిత నీటి ట్యాంకులకు తరలిస్తారు. సముద్రమట్టానికి 200 మీటర్ల ఎత్తులోని వైఎస్సార్ జిల్లా గండి జలాశయం నుంచి 664 మీటర్ల ఎత్తులోని అన్నమయ్య జిల్లాలోని మామిళ్లవారిపల్లె రీట్రీట్ ప్లాంటుకు 3.37 టీఎంసీల కృష్ణా జలాలను ఎత్తిపోసే భగీరథ ప్రయత్నమిది.

కొత్త గ్రిడ్ పేరుతో అన్యాయం

గ్రామీణ నీటి సరఫరా అధికారులు దీనిపై వివరణ ఇస్తూ ప్రభుత్వం చిత్తూరు, తిరుపతి రెండు జిల్లాలను కలిపి వాటర్ గ్రిడ్ పథకం తీసుకొస్తోందని వివరించారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ కానున్నాయని చెప్పారు. ఇది ఎప్పటికి కార్యరూపం దాల్చుతుందో తెలియదు. కాని ఉన్న పథకాన్ని రద్దు చేసి పుంగనూరుకు తీవ్ర అన్యాయం చేస్తోంది కూటమి ప్రభుత్వం. దీనిపై నియోజకవర్గ ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

మొదట సవరించి తర్వాత రద్దు ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,825 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం మొదట సవరించి నివేదిక ఇవ్వాలని కోరగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాజా నివేదికలు పంపారు. తర్వాత గ్రిడ్ నుంచి పుంగనూరును తప్పించగా ప్రస్తుతం దీన్ని పూర్తిగా రద్దు చేసింది. రెండో విడతలో పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలను కలిపి గ్రిడ్ అమలు చేస్తారని అధికారులు చెబుతూ వస్తున్నారు. ఈ కొత్త ప్రణాళికలతో పనులు కార్యరూపం దాల్చడానికి ఇంకెన్నేళ్లు పడుతుందో పుంగనూరు ప్రజల దాహార్తి తీరుస్తారా లేదా అన్నది సందిగ్ధంగా మారింది.

నగరి రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత



పట్టుకున్న సిమెంటు లారీతో డీఎస్పీ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

నగరి : మున్సిపల్ పరిధి టూరిస్టు రెస్టారెంట్ సమీపం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు మృతి చెందగా, 14 మందికి రక్తగాయాలు అయిన విషయం విదితమే. ఈ సంఘటనలో బస్సును ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లడంతో ఏ వాహనం ఢీకొందన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. సీసీ కెమెరాల ఆధారంగా డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి, సీఐ మహేశ్వర్ రెడ్డి సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. బస్సును వెనుక వైపు నుంచి ఢీకొన్న టీఎన్ 23 బీఈ 5618 అనే సిమెంట్ లారీని పట్టుకున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైవర్ నుంచి రాబట్టిన సమాచారం మేరకు తిరుపతి నుంచి వస్తున్న లారీ నగరి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న బస్సు రెండు అతి వేగంగా వెళుతూ వెలుతురు తక్కువగా ఉన్న ప్రాంతంలో నిర్లక్ష్యంతో ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్టేక్ చేయడానికి ప్రయత్నించడమే ప్రమాదానికి కారణమైనట్లు తేలిందన్నారు. సిమెంటు లారీ వెనుక భాగం బస్సు మధ్య భాగంలోని సీట్ల నుంచి బలంగా గుద్దుకోవడంతో ఘోర ప్రమాదం జరిగిందన్నారు. లారీ ఆపకుండా పారిపోయి చెన్నైలో ఉండగా సీసీ కెమెరాల ద్వారా లారీని గుర్తించి చెన్నైలోనే పూందమల్లి వద్ద లారీని పట్టుకొని డ్రైవర్‌ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. లారీ అనకాపల్లి నుంచి చెన్నైకి సిమెంట్ లోడుతో వస్తోందని సూళ్లూరుపేట మీదుగా నేరుగా వెళ్ల వచ్చని కానీ అటువైపు పూందమల్లి రావాలంటే ట్రాఫిక్ పోలీసులు చెన్నై సిటీలో ఎంటర్ చేయరని తెలిసి నగరి వైపున వెళుతున్నాడన్నారు. నిబంధనలు అతిక్రమించిన అన్నింటిపై వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వీరజవాన్‌కు డీఆర్‌ఓ నివాళి



బంగారుపాళెం : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఎదురు కాల్పులో వీర మరణం పొందిన జవాన్ కార్తీక్‌కు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ నివాళులర్పించారు. మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామంలో బుధవారం వీరజవాన్ పంగల కార్తీక్ కర్మక్రియ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి డీఆర్‌ఓ పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్తీక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబూరాజేంద్ర ప్రసాద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం, ఏంఈజీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

విలీనపడి.. మూతబడి

వైఎస్సార్‌సీపీ పాలనలో సర్కారు బడులు ఓ వెలుగు వెలిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బడులను కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్దారు. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత ప్రభుత్వంలో విలీన ప్రక్రియ చేపట్టిన సమయంలో అప్పటి ప్రతిపక్ష టీడీపీ నానా యాగీ చేసింది. ప్రభుత్వ బడులు అస్తవ్యస్తం అవుతున్నాయంటూ హంగామా చేసింది. అధికారంలోకి వస్తే సర్కారు బడుల విలీనం ఉండదని అప్పట్లో చంద్రబాబు , లోకేష్ హామీలు గుప్పించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ప్లేటు ఫిరాయించింది. కొత్తగా ఆదర్శ పాఠశాలలు, ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ బడులను విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది.

- నాడు విలీనం లేదన్నారు.. నేడు ప్లేటు ఫిరాయింపు !
- ప్రభుత్వ బడిపై విలీన పిడుగు
- గతంలో నానా యాగీ చేసిన టీడీపీ సర్కారు
- అధికారంలోకి వచ్చాక విలీనం ఉండదని సంఘం నేతలకు హామీ
- సీఎం , లోకేష్ హామీలు మాటలకే పరిమితం !



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సర్కారు బడులపై కక్ష కట్టింది. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సింది పోయి విలీనం పేరుతో కత్తి దూస్తోంది. బడుల విలీనం చేపట్టమని హామీ ఇచ్చి తుంగలో తొక్కింది. కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చే విధంగా అసంబద్ధత నిర్ణయాలు తీసుకుంటోంది. జిల్లాలోని ప్రతి మండలంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. ఈ మేరకు గుట్టు చప్పుడు కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇటీవల తిరుపతి జిల్లా కేంద్రంలో నోడల్ సమావేశం నిర్వహించి చర్చించారు.

ప్రపంచబ్యాంకు ఆంక్షలతోనే..

ప్రపంచ బ్యాంకు ఆంక్షలతో కూటమి టీడీపీ పాఠశాలల విలీనానికి తెరలేపింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్ర స్థాయిలో సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి విలీన ప్రక్రియ ఉండదని ప్రకటించారు. కానీ ప్రస్తుతం మాట తప్పి జిల్లా వ్యాప్తంగా విలీన ప్రక్రియకు తెరలేపారు. టీచర్ల సర్దుబాటు కోసం పిల్లల అవసరాలు, వారి సమస్యలను గాలికి వదిలేస్తోంది.

కసరత్తు ఇలా...

- విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయనున్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతోనే నిర్వహిస్తున్నారు. వాటిని గుర్తించాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో 688 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి.
- 60 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ పేరుతో మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మోడల్ ప్రైమరీ (ఆదర్శ పాఠశాలలు) ఎక్కడెక్కడ అవసరమని కసరత్తు చేపట్టారు.
- ప్రీ ప్రైమరీ, ఫౌండేషన్ స్కూళ్ల అవసరం ఉంటే వాటి వివరాలతో పాటు 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే పాఠశాలల వివరాలు సేకరిస్తున్నారు. అక్కడ 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించి ప్రత్యేక హెచ్‌ఎంను నియమించనున్నారు.
- 6–10 తరగతులు బోధించే పాఠశాలల వివరాలతో పాటు 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న బడుల వివరాలను సేకరించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

బడికి దూరంగా విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో 4410, ప్రాథమి కోన్నతలో 1239, ఉన్నత పాఠశాలల్లో 6,290 మొత్తం 11,939 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రకరకాల కారణాలతో పాఠశాల విలీన ప్రక్రియకు తెర లేపింది. ఈ ప్రక్రియతో ప్రభుత్వ విద్యార్థులను బడులకు, చదువులకు దూరం చేస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.

దబ్బులిచ్చి చేతులు దులుపుకోవడం కాదు



ప్రభుత్వం విలీన ప్రక్రియను చేపట్టి దూరంగా ఉన్న విద్యార్థులకు రవాణా చార్జీలు ఇచ్చి చేతులు దులుపుకోవాలనుకుంటోంది. గత ప్రభుత్వం పేదల కోసం ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. అదే విధంగా ఈ ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపడితే విద్యార్థులకు రవాణా భత్యం కాకుండా బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.– జీవీ. రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

హామీకి విరుద్ధంగా కసరత్తు చేస్తున్నారు



కూటమి ప్రభుత్వం హామీకి విరుద్ధంగా విలీన ప్రక్రియ చేపడుతోంది. 117 జీఓను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో సంఘం నేతలతో నిర్వహించిన సమావేశంలో విలీన ప్రక్రియ కసరత్తు విధి విధానాలు చెప్పింది ఒకటి ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేస్తున్నది మరొకటి. ఈ విలీన ప్రక్రియ చాలా నష్టం చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను నిలిపివేయాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం. – మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలోని ప్రభుత్వ బడుల సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
ప్రాథమిక	1,902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	2,436	1,41,217

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మొరపెట్టుకున్నా..

జిల్లాలోని ప్రతి పల్లెలో 3 కి.మీ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, 5.కి.మీ పరిధిలో ఉన్నత పాఠశాలలు గతం నుంచి నడుస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ప్రస్తుతం విలీనం పేరుతో సర్కారు బడులకు నష్టం చేకూరేలా చర్యలు చేపడుతోంది. విలీనం ప్రక్రియ వద్దని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, మొరపెట్టుకున్నారు. ఇదే సందర్భంలో విలీనం చేసేది లేదని ప్రస్తుత కూటమి టీడీపీనే హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుతం ఆ హామీని తూచ్ మనిపించింది. విలీనం ప్రక్రియ చేపడితే గ్రామం నుంచి విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉంటుందని తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నారు. ఫలితంగా డ్రాపౌట్స్ శాతం పెరుగుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విలీన కసరత్తు పూర్తి అయితే తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపడం ఖాయమని ఉపాధ్యాయులు వెల్లడిస్తున్నారు.

తొలుత ఒక మాట.. ఇప్పుడు మరోమాట



విలీన ప్రక్రియను రహస్యంగా చేపడుతున్నారు. అంత రహస్యంగా చేపట్టాల్సిన అవసరం ఏ ముందో తెలియడం లేదు. 3 కి.మీ పరిధిలో ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేకపోతే అటువంటి ప్రాంతాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలి. ఆ బడుల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలి. ప్రభుత్వ బడుల విద్యార్థులకు నష్టం చేకూరితే ఆందోళనలు తప్పవు.
– మణిగండన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నులిమేద్దాం!

- చిన్నారుల ఆరోగ్యానికి నులిపురుగు నివారణ కీలకం
- అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : చిన్నారుల ఆరోగ్యానికి నులిపురుగు నివారణ చాలా కీలకమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల దినోత్సవం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించిన వివరాల ప్రకారం అధిక సంఖ్యలో చిన్నారులు నులి పురుగుల కారణంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వాటి నుంచి చిన్నారులకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. జిల్లాలో ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 400 మి.గ్రాముల ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ చేస్తారన్నారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వరకు ఉన్న విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఇందు కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి నులి పురుగుల నివారణ మాత్రలపై ఇప్పటికే అవగాహన కల్పించారన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, డీపీఎంవో హనుమంతరావ్, ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శిరీష తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ క్రీడలకు ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ ఫెన్సింగ్ క్రీడలకు ఇద్దరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు బుధవారం క్రీడాభివృద్ధి అధికారి కార్యాలయంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఐరాల మండలం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు దినేష్, తులసీరామ్ జాతీయ క్రీడలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పాట్నాలో జరిగే అండర్–19 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రఫిక్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ పోరాటానికి పార్టీ అండ

– భరత్‌కు జగన్ హామీ



తాడేపల్లిలో జగన్‌ను కలిసిన కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్

కుప్పం : నియోజకవర్గంలో అక్రమ కేసులతో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు న్యాయ సాయం చేసేందుకు అండగా ఉంటామని కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహా కూటమి అధికారం చేపట్టిన అనంతరం నియోజకవర్గంలో ఇప్పటికే 35 తప్పుడు కేసులు నమోదు చేసినట్లు భరత్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు రామకుప్పం మండలం 89–పెద్దూరు సర్పంచ్, కొంగనపల్లి సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేశారని ఆయనకు తెలిపారు. దీనిపై సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ఈ కేసులను అప్పగించినట్లు ఆయన తెలిపారు. తప్పుడుగా ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసులపై న్యాయవాదులతో చర్చించి న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. వీటికి పార్టీ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అధికార దుర్వినియోగం చేస్తున్న అధికారులు, నాయకులను వదిలిపెట్టేది లేదని, వడ్డీతో సహా మూల్యం చెల్లిస్తామని, భయపడవద్దంటూ ఆయన భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

అనాథలకు అండ..ఆ నలుగురు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేపట్టిన హెల్పింగ్ హ్యాండ్స్ మిత్ర బృందం

పలమనేరు: కంటికి రెప్పలా పిల్లలను కని పెంచి.. వారి జీవితం బాగుండాలని... తన జీవితాన్నే ధారపోసి పెద్ద చేసి.. ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే కలలు కనే తల్లిదండ్రులు అనాథలుగా మారి ఊరుగానిచోట మృతి చెందితే వారి అంతిమ సంస్కారాలకు కన్నవారు నోచుకోకపోతే ఆ పరిస్థితి మాటలకందని విషాదం.. కానీ పట్టణానికి చెందిన ఆ నలుగురు.. కన్న కొడుకులై అన్నీ తామై అతనికి అంత్యక్రియలు నిర్వహించి గొప్ప మనస్సు చాటుకున్నారు. ఇలాంటి దయనీయమైన సంఘటనే పలమనేరులో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద 59 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అతని మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలను వెతికినా లాభం లేకుండా పోయింది. దీంతో అనాథ శవంగా భావించి అంత్యక్రియలు చేసేందుకు స్థానిక పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్‌కు సమాచారం అందించారు. దీంతో ఆ మిత్ర బృందం ఆ అనాథకు స్థానిక హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయబద్ధంగా అన్నీ తామై కన్న కొడుకుల్లా అంత్యక్రియలను నిర్వహించి గొప్ప మనస్సు చాటుకున్నారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు పట్టణానికి చెందిన జీలు సాయం చేయగా హెల్పింగ్ హ్యాండ్స్ మిత్రబృందం శివ, నరేంద్ర, పృథ్వీరాజ్, మదేష్ తదితరులు, పోలీసులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

మార్చి 17 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మార్చి 17 వ తేదీ నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేశారు. ఆ షెడ్యూల్ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నారు. మార్చి 17వ తేదీన హిందీ, 19వ తేదీ ఇంగ్లీష్, 21న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 24న గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 26వ తేదీన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం, 28వ తేదీన సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలు నిర్వహించబడుతాయన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

ఇల్లే ఇవ్వలేదు.. లోను కట్టాలంటా?



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న రాష్ట్ర చైర్మన్

చిత్తూరు అర్బన్: ''మాకు ఇంకా ఇళ్లు ఇవ్వలేదు.. కానీ లోను మాత్రం కట్టమని బ్యాంకు నుంచి ఫోన్లు చేస్తా ఉండారు.. గవర్నమెంటే కడతాది, మీరేమి కట్టొద్దు అని సీఎం చెప్పినారు.. మేము ఏది నమ్మాల..?'' అంటూ టిడ్కో గృహాల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ బుధవారం చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని పూనేపల్లెలో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తాము పూర్తి స్థాయిలో ఇళ్లను నిర్మించి ఇవ్వలేదని, మరోవైపు బ్యాంకుల నుంచి అధికారులు ఫోన్లు చేసి, గృహాలపై తీ సుకున్న రుణాలకు నెలసరి వాయిదాలు (ఈఎంఐ) చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నట్లు చైర్మన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై అజయ్‌కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరూ ఈఎంఐలు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ ఏడాదిలోపు సదుపాయాలు కల్పిస్తామన్నారు. చైర్మన్ వెంట చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, టిడ్కో డీఈ దేవిక, డీఈ వెంకటముని పాల్గొన్నారు.

భర్త మృతదేహంతో రోడ్డెక్కిన మహిళ

- పిల్లలతో కలిసి ఆందోళన
- న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని నిరసన




తన పిల్లలు, బంధువులతో కలసి రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజ


శ్రీరంగరాజపురం : మండలంలో ఓ మహిళ, తన పిల్లలు కలసి తన భర్త మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేదంటే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంటామని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బాధిత మహిళ గిరిజ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాతపాళెం దళితవాడకు చెందిన వెంకటేష్ (35)ను సోమ వారం అదే గ్రామానికి కొందరు ఓ కార్యక్రమానికి తీసుకెళ్లారు. అందరూ ఓ వాహనంలో వెళుతుండగా మార్గం మధ్యలో వాహనం బోల్తా పడి వెంకటేష్ మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన భార్య గిరిజ ఫిర్యాదు చేశారు. ప్రమాదం జరిగి రెండు రోజులు కావస్తున్నా తన భర్త మృతికి కారణమైన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామానికి వెళ్లే రహదారిపై వెంకటేష్ మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచి తన పిల్లలు, బంధువులతో కలసి గిరిజ నిరసనకు దిగారు. తనకు న్యాయం చేయకుంటే తాను, తన పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. అనంతరం వెంకటేష్ మృతదేహానికి బుధవారం దహన సంస్కారం నిర్వహించారు.

మృత్యువులోనూ వీడని అనుబంధం

వారంతా తోబుట్టువులు..తన పుట్టింట మేనల్లుడు, మేనకోడల వివాహ వేడుకలు నిశ్చయమైన సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా కలవాలకొన్నారు. అన్నాచెల్లెలు ఇద్దరూ కలిసి కాసేపు ఆనందంగా ముచ్చట్లు చెప్పుకున్నారు. ఆ సంతోషంలో మరొకరిని కలిసేందుకు ఇద్దరూ కలిసి ఉత్సాహంగా బయలు దేరారు. ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. విధికి కన్నుకుట్టిందేమో.. అనుకోని మృత్యువు ఎదురొచ్చింది. ఇంకెప్పుడు తోబుట్టువును చూడలేని... కలుసుకోలేని సుదూర లోకాలకు తీసుకెళ్లింది. వీరి అనుబంధాన్ని, ఆశయాలను, ఆశలను మధ్యలోనే తుంచేసిన విషాదకర ఘటన విజయపురం మండలం, తెల్లగుంట తిరుత్తణి రోడ్డులో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అన్నాచెల్లెలు మృత్యువాత పడిన విషాద ఘటన ఇది..

- రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లి మృతి
- అగరంపేటలో విషాదచాయలు





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవి, సోదరి మంజుల

విజయపురం : మండలంలోని తెల్లగుంట సమీపం తిరుత్తణి రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రవి (58), మంజుల (44) అన్నచెల్లెలు దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనంపై తిరుత్తణి వైపు వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటన స్థలంలోనే ఇద్దరూ మృతి చెందారు. కాగా నింద్ర మండలం, అగరంపేట దళితవాడకు చెందిన రవి భార్య రెండేళ్ల కిందట మృతి చెందడంతో కుమార్తె, కుమారులకు అన్ని తానై చూసుకొంటున్నాడు. తన కుమార్తె, కుమారుడికి మరో మూడు నెలలో వివాహం జరగనుంది. వివాహానికి సంబంధించిన వ్యవహారాలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకొందామని రవి చెల్లెలు మంజుల కేవీబీపురం మండలం కొల్లత్తూరు నుంచి బుధవారం సాయంత్రం అగరంపేట వచ్చింది. అక్కడ కాస్త అనారోగ్యంగా ఉండటంతో రవి, మంజుల పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఆసుపత్రిలో చికిత్స చేసుకొని కేవీపురం గ్రామంలో ఉన్న మరో చెల్లి దేశమ్మను చూసొచ్చేందుకు బయలుదేరారు. ఇంతలోనే వారికి మృత్యువు గుర్తు తెలియని వాహనం రూపంలో వచ్చి ఢీకొంది. ఇప్పటికే తల్లిని కోల్పోయిన పిల్లలు తండ్రిని కూడా కోల్పోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అన్న, చెల్లి మృతితో అగరంపేటలో విషాదచాయలు అలుముకున్నాయి. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ బలరాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగోలుగా మట్టి దోపిడీ

- కూటమి నేతల గుప్పిట్లో మాఫియా
- చేతులుకట్టుకున్న అధికారులు



సాతు చెరువులో మట్టి తవ్వకాలు

శాంతిపురం : ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి అక్రమ మట్టి తరలింపు కూటమి నేతల కనుసన్నల్లో ముమ్మరంగా సాగుతోంది. బుధవారం మండలంలోని కొలమడుగు పంచాయతీ అమ్మవారిపేట సమీపంలోని బాలప్ప చెరువు వద్ద, రాళ్లబూదుగూరు పంచాయతీలోని సాతు చెరువు నుంచి మట్టి తరలింపు యథేచ్ఛగా సాగిపోతోంది. కొత్తగా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టుకొస్తున్న నేపథ్యంలో వాటిని చదును చేయటానికి మట్టి అవసరం అవుతోంది. దీంతో రియల్టర్లు అధికార పార్టీ నాయకులను ఆశ్రయించి, వారి డిమాండ్లను నెరవేర్చి జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో మట్టిని ఇష్టారాజ్యంగా తోలుకుంటున్నారు. సాతు చెరువు నుంచి మూడు రోజులుగా మట్టిని జోరుగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో సాతు నుంచి చెరువు పక్కగా గెసికపల్లికి వెళ్లే బండి బాటను నామరూపాలు లేకుండా తవ్వేశారని స్థానికులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేత అక్రమ మట్టి తరలింపు వ్యవహారం నడిపిస్తున్నారని చెబుతున్నారు. దీనిపై పంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు తెలిపినా ఆ నాయకుడి పలుకుబడికి భయపడి పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు వాపోయారు. అలాగే అమ్మవారిపేట – రామాపురం మధ్య ఉన్న బాలప్ప చెరువు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి నుంచి అక్కడి తెలుగు తమ్ముడి దయతో మట్టి తరలింపు సాగుతోంది. ఆయా వ్యవహారాలను అధికార పార్టీలో గుర్తింపు ఉన్న నాయకులు చేస్తుండటంతో అధికారులు పట్టనట్లు వదిలేస్తున్నారు. చెరువుల్లో అడ్డగోలుగా మట్టి తవ్వకాలతో భవిష్యత్తులో వర్షాలు వచ్చినా నీరు నిలవకుండా ఇంకిపోతాయని, సమీప ప్రాంతాల్లోని భూములు కోతకు గురవుతాయని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.